# ౨

# మోసపోయిన మృత్యువు

ఒక ఊరిలో ఒక కట్టెలు కొట్టేవాడు ఉండేవాడు.

ముసలివాడైన అతను రోజంతా కష్టపడినాకూడా వచ్చేడబ్బుతో ఇల్లు గడవటం కష్టంగాఉండేది. ఒకరోజున అతను మామూలుకంటే ఎక్కువగా కట్టెలు కొట్టాడు. వాటిని చూసి ఎక్కువ డబ్బు వస్తుందని సంతోషించాడు.వాటిని మోపుగా కట్టి ఎత్తుకోబోతే, వాటి బరువుకి అది సాధ్యం కాలేదు. ఎంత ప్రయత్నించినా ఎత్తలేకపోయేసరికి విసుగుపుట్టి "ఓ మృత్యుదేవతా...! నీకైనా నామీద దయ రాదా?" అని గట్టిగా అరిచాడు.

ఆ పిలుపు విని వెంటనే మృత్యుదేవత అక్కడకు వచ్చి "నన్నెందుకు పిలిచావు?" అంది.

అనుకోని ఈ సంఘటనకి కొయ్యబారిపోయాడు అతను. పైకి ధైర్యం తెచ్చుకొని, "నువ్వు మృత్యుదేవతవని నాకేమిటి నమ్మకం?" అన్నాడు.

"సరే...నేనెవర్నో నిరూపిస్తాను. అటుచూడు- ఆ కొలనులో స్నానం చేస్తోందే...అవిడ ఆయువు తీరిపోయింది. ఇప్పుడే ఆమె ప్రాణాలు తీస్తాను" అంటూ ఒక చిన్న గులకరాయి తీసుకొని ఆమె మీదకి విసిరింది మృత్యుదేవత. ఆ రాయి తగలగానే ఆమె చనిపోయింది.

కట్టెలు కొట్టేవాడికి మృత్యుదేవతపై నమ్మకం కలిగింది. పైకి బింకంగా "ఈ కట్టెల మోపు ఎత్తుకోలేక నిన్ను పిలిచాను. దీన్ని కాస్త నా భుజం మీదకి సాయం పట్టు" అన్నాడు.

మృత్యుదేవత తన చిటికెనవేలితో ఆ మోపును సునాయాసంగా ఎత్తి అతని భుజం మీద పెట్టింది. ఆ ముసలివాడు ధన్యవాదాలు తెల్పి,"ఓ మృత్యుదేవతా! నా ఆయుష్షు ఇంకా ఎంతకాలం ఉందో చెప్తావా?" అని అడిగాడు.

"నేటినుంచి సరిగ్గా ఐదు సంవత్సరాలు!"అని చెప్పి రివ్వున మాయమయింది మృత్యుదేవత.



మృత్యుదేవత మాటలు విన్న ముసలివాడికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఎలాఅయినా మృత్యు దేవత మాటని అబద్ధం చెయ్యాలనుకున్నాడు. మరునాడు ప్రొద్దుటే అడవికి వెళ్లిపోయాడు. రోజుల తరబడి అక్కడే ఉండి పోయాడు. అతనికేదో ప్రమాదం జరిగి ఉంటుందని ఊళ్లో అందరూ అనుకున్నారు. అయితే– అతను అడవిలో ఊరికే ఉండలేదు. అడవిలో తన గొడ్డలితో ఒక మహావృక్షం కాండంలో పెద్ద బొరియ చేశాడు. అందులో ఒక గదిలాగా చెక్కాడు. అంతేకాదు, ఎంతో ఓపికగా ఐదు సంవత్సరాలపాటు జాగ్రత్తగా చాలా అందంగా నాలుగు అంతస్థుల భవనాన్ని ఆ చెట్టు కాండం లోపల నిర్మించాడు. అయితే, అందులోకి రావడానికీ, పోవడానికీ ఒకే ఒక ద్వారం ఉంచాడు.

మృత్యుదేవత చెప్పినరోజు రానే వచ్చింది. ముసలివాడు నిబ్బరంగా అడవిలో తిరుగాడుతున్నాడు. మృత్యుదేవత అతని ముందు ప్రత్యక్షమయి, "ఈ రోజుతో నీ ఆయువు తీరింది. నీ ప్రాణాలు తీసుకుపోడానికి వచ్చాను" అంది.

"అలాగే వస్తాను. రాక తప్పుతుందా? అదిసరే, నా తర్వాతివారు నన్ను జ్ఞాపకం ఉంచుకునేటట్లుగా నేను అద్భుతమైన పనితనం కలిగిన ఇంటిని నిర్మించాను. నేను చనిపోయే ముందు దానిని నీకొక్కసారి చూపించాలనుకుంటున్నాను" అన్నాడు ముసలివాడు.

"అలాగే..." అంటూ ముసలివాడివెంట నడిచింది మృత్యుదేవత. ఒక్కొక్క అంతస్తునీ చూపిస్తూ చివరి అంతస్తుకి తీసుకువచ్చాడు ముసలివాడు. ఆ ఇంటిలోని అద్భుతమైన పనితనాన్ని చూస్తూ ఆనందంతో పరవశించసాగింది మృత్యుదేవత.

ముసలివాడు కాలకృత్యం తీర్చుకుని వస్తానని చెప్పి గబగబా క్రిందికి దిగాడు. బయటికి

వచ్చీ రాగానే తలుపుమూసేసి బయటనుంచి గడియ పెట్టేశాడు. ఆ విధంగా మృత్యుదేవతని చెట్టులో బంధించి హాయిగా ఇంటికి వెళ్లిపోయాడు.

రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి. మనుషులకి, జంతువులకి, సర్వప్రాణులకీ సంతతి పెరుగుతోందేకాని, ఎవరికీ చావంటూ రావడంలేదు. జనాభా పెరిగిపోవడంతో కరువుకాటకాలు ప్రబలాయి. ప్రపంచమంతా అట్టుడికినట్టు ఉడికిపోసాగింది. స్వర్గలోకంలోని దేవతలు కూడా ఈ పరిస్థితికి కంగారు పడసాగారు. అందరూ కలసి లయకారుడైన శివుణ్ని వేడుకున్నారు. శివుడు వాళ్ళకి అభయం ఇచ్చి పంపించివేశాడు.

మరునాడు శివుడు మానవరూపంలో భూమిమీదకి వచ్చాడు. ముసలివాని ఇంట్లో ప్రవేశించాడు. అతను ఒక మంచం మీద నీరసంగా పడుకుని ఉన్నాడు.

శివుడు అతన్ని చూస్తూ "నీకు ఇంకా జీవితం మీద విసుగు పుట్టలేదా? ఇంకా జీవించాలనే అనుకుంటున్నావా?" అని అడిగాడు.

"నేను జీవితాన్ని పూర్తిగా అనుభవించాను. అదంటే విసుగు పుట్టేసింది. చనిపోవాలని ఉన్నా చనిపోయే స్థితిలో లేను. ఎందుకంటే ఇంకా బ్రతకాలనే పేరాశతో మృత్యుదేవతని చెట్టులోపెట్టి బంధించి వేశాను. పోయి విడిపించాలని ఉన్నా నాకు అక్కడివరకు వెళ్లే ఓపిక లేదు" అన్నాడు అతను దీనంగా.

శివుడు ముసలివానికి చేయూతనిచ్చి అడవిలోని ఆ చెట్టు దగ్గరికి తీసుకుపోయి చూస్తే... మృత్యుదేవత ఊపిరి ఆడక కొట్టుకొంటూ సగం చచ్చినట్లుగా పడి ఉంది.

శివుడు ఆమె దేహాన్ని స్పృశించగానే ఆమె మామూలుగా అయింది.

వెంటనే ఆమె శివుని పాదాలపై పడి "మహాప్రభో... ప్రాణాలు హరించే పని నావల్ల కాదు. నాకు వేరే ఏదైనా విధిని అప్పజెప్పండి" అంటూ వేడుకుంది.

"భయపడకు. ఒక్కొక్కసారి ఎంతటి వారికైనా కష్టాలు వస్తాయి. అంతటితో బెదిరిపోయి బాధ్యతలని తప్పించుకుంటానంటే ఎలా?" అని నచ్చచెప్పాడు శివుడు.

"అలా అయితే మహాప్రభూ...మనుషులు నా రూపాన్ని చూడగలుగుతున్నారు కనుక నాకు ఈ దుర్దశ వచ్చింది. అందుచేత నేను వారి కంటికి కనపడకుండేటట్లు వరం ప్రసాదించు పరమశివా... అప్పుడు నా ధర్మాన్ని నేను ఏ లోటూ లేకుండా నెరవేర్చగలను" అంది మృత్యుదేవత.

"అలాగే..!" అని అనుగ్రహించాడు శివుడు. అప్పటినుంచి మృత్యుదేవత అదృశ్యంగా మానవులలో తిరుగాడుతూ తన విధిని నిర్వర్తించసాగింది.

★★★